తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష


కండ్రిక యూపీహెచ్‌లో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ


చుట్టుగుంటలో అవగాహన ర్యాలీ

- ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు
- తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని కావున ప్రతీ తల్లి బిడ్డకు తప్పనిసరిగా ఇవ్వాలని గులామొహద్దీన్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆయేషా సూచించారు. స్థానిక చుట్టుగుంటలో గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆయేషా మాట్లాడుతూ తల్లిపాలలో సహజసిద్ధమైన వ్యాధినిరోధక శక్తి ఉంటుందని పేర్కొన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ సోకే ప్రమాదం తగ్గడంతో పాటు చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లీ బిడ్డల మధ్య అనురాగం బలపడుతుందని అన్నారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్. జయలక్ష్మి ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

పాయకాపురం(విజయవాడరూరల్): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని వైద్యులు పేర్కొన్నారు. స్థానిక 61, 62, 63, 64వ డివిజన్లలోని ఆయా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైద్యులు గర్భిణులు, బాలింతలతో సమావేశాలు నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ ఎదుగుదలకు, ఆరోగ్యంగా ఉండటానికి దోహదం చేస్తాయన్నారు. అలాగే తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలియజేశారు. అనంతరం వైద్యసిబ్బంది ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో డాక్టర్ ఎస్.రమ్య, డాక్టర్ ఎంవీ రాథోడ్, డాక్టర్ కె.రాజా, డాక్టర్ ఎస్‌కె. ఖాజా, కమ్యూనిటీ ఆర్గనైజర్ మణి, సీఓ, హెచ్‌వీ, ఏఎన్‌ఎమ్‌లు, ఆషా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీని ఎత్తేసేందుకు కుట్ర

- వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు
- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ విమర్శించారు. పేదలకు సంజీవని వంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని సైతం ఎత్తేసేందుకు కుట్ర జరుగుతోందని, అందుకు ఇటీవల కేంద్ర సహాయ మంత్రి వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని తన కార్యాలయంలో మెహబూబ్ షేక్ గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు గడిచినా, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ నెల 15 నుంచి సేవలు నిలిపివేస్తామని స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటించినట్లు తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వంలో పెండింగ్ ఆరోగ్యశ్రీ బిల్లులు అన్నీ రిలీజ్ చేసిన అంశాన్ని గుర్తు చేశారు. పేదల ఆరోగ్యం విషయంలో వివక్ష తగదని తక్షణమే నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించి, ఈ పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీంతో ఈ ఏడాది మరో ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు జరగాల్సి ఉన్నా, ఎన్‌ఎంసీ నుంచి అనుమతులు రాలేదని పేర్కొన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలి కారణమన్నారు. వెంటనే లోపాలను సరిచేసి అడ్మిషన్లు జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో సైతం నాణ్యమైన వైద్య సేవలు అందేలా, మందుల కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు.. రామవరప్పాడుకు చెందిన ఉల్లి అనిల్‌కుమార్ అలియాస్ రాజు, రమాదేవి దంపతులు హోటల్ వ్యాపారం చేస్తుంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వ్యాపారం కోసమని అనిల్ పలు బ్యాంకుల్లో, చుట్టుపక్కల వారి వద్ద అప్పులు చేశాడు. అయితే వ్యాపారంలో నష్టం రావడంతో అతనిపై వత్తిళ్లు పెరిగిపోయాయి. ఈ క్రమంలో భార్య బిడ్డలను గత నెల 31వ తేదీన వారి పుట్టింటిలో వదిలి మా అమ్మానాన్నల దగ్గరకు వెళ్లి డబ్బులు తీసుకువస్తానని చెప్పి బైకుపై వెళ్లాడు. ఆ తర్వాత భార్యకు ఫోన్ చేసి బైకు సింగ్‌నగర్ స్మశాన వాటిక వద్ద పెడుతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అతని భార్య తన కుటుంబ సభ్యులను తీసుకొని సింగ్‌నగర్ స్మశాన వాటిక వచ్చి చూడగా అక్కడ అతని బైకు, ఫోన్ గుర్తించారు. చుట్టుపక్కల ఎక్కడా అతని ఆచూకీ లభించలేదు. దీంతో భార్య రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సింగ్‌నగర్‌లో గేదెల దొంగలు హల్‌చల్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గేదెల దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గత నెల రోజుల నుంచి ఇక్కడ దాదాపు 12 గేదెలకు పైగా కనిపించకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. సింగ్‌నగర్ నందమూరినగర్ పరిసర ప్రాంతాల్లో పలువురు రైతులు గేదెలను పెంచుతూ పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే గేదెలను కొంతమంది దొంగతనంగా వ్యానుల్లో ఎక్కించి గుంటూరుకు తరలించి విక్రయిస్తున్నట్లుగా తెలుస్తుంది. ఒక్కో గేదె రూ. 1 లక్ష వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు.

ఇంట్లో కట్టేసిన గేదెలు మాయం

నందమూరినగర్ ఉప్పలపాటి సీతారామరాజు వీధికి చెందిన కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు తన 23 గేదెలను గత నెల 21వ తేది రాత్రి ఇంటి దగ్గర దొడ్డిలో కట్టేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి ఐదు గేదెలు కనిపించలేదు. ఇదేవిధంగా భారతమాత మందిరం రోడ్డు, సన్‌సిటీ కాలనీ, తోటవారి వీధి పరిసర ప్రాంతాల్లోని రైతులకు చెందిన మరో ఏడు గేదెలు కూడా మాయమయ్యాయి. దీంతో బాధితులు సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కారు ఢీ కొట్టడంతో మహిళ గాయపడిన ఘటనపై గురువారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు.. ఊర్మిళనగర్‌కు చెందిన బృగుమళ్ల కృష్ణ వెంకట కిషోర్ భార్య వాహిని లక్ష్మి గత నెల 27వ తేదీన అనారోగ్యంతో ఆసుపత్రిలో చూపించుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఆమె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భర్త వెంకట కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌పోల్‌ను ఢీ కొట్టిన లారీ..

రామవరప్పాడు రింగ్ ఇన్నోటెల్ హోటల్ వెనుక విద్యుత్ స్థంభాన్ని లారీ అదుపు తప్పి ఢీ కొట్టడంతో గురువారం కేసు నమోదయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున వేగంగా వచ్చిన లారీ విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ స్థంభం ధ్వంసం అయ్యింది. అదృష్టవశాత్తూ అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నగరపాలకసంస్థ అసిస్టెంట్ ఇంజినీర్ విమల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం తగదు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర


బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. 30వ డివిజన్, రామకృష్ణాపురం మధ్య కట్ట వద్ద లబ్ధిదారులకు బయోమెట్రిక్ ద్వారా ఆయన గురువారం పింఛన్లు అదజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుతో కమిషనర్ మాట్లాడారు. ప్రతి నెలా పింఛన్ వస్తుందా? ఇంటి వద్దనే ఇస్తున్నారా? లేదా? ఎంత ఇస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి సెక్రటరీలు పింఛన్లు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన 29వ డివిజన్ మధురానగర్ అండర్ బ్రిడ్జ్, బీఆర్టీఎస్ రోడ్డు దగ్గర ఉన్న జీఎస్ శాస్త్రి పార్క్‌ను పరిశీలించారు. పార్క్‌లో ఎల్లప్పుడూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, పార్క్ ఆవరణలో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని సబంధిత అధికారులకు సూచించారు. మధురానగర్‌లో చివరి దశలో ఉన్న రోడ్ – బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బుడమేరు కాలువలోని గుర్రపు డెక్కలను తీసి కాలువను పరిశుభ్రపరచాలని పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన నవనీతం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నవనీతం నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీడీపీ నేతలు పైడి శ్రీను, జాన్ వలి, బంగారు నాయుడు తదితరులు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన సెంట్రల్ ఏసీపీ దామోదర్



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సెంట్రల్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా నియమితులైన కె.దామోదర్ గురువారం లబ్బీపేటలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో పటమట, పెనమలూరు పోలీస్‌స్టేషన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పని చేసిన ఆయన బదిలీపై సెంట్రల్ ఏసీపీగా వచ్చారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్‌లో గురువారం మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పడమటి రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే 26వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్ వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్ పంపిణీ చేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు తోట పాండు పాల్గొన్నారు.

ఘనంగా పీవీపీ మాల్ పదో వార్షికోత్సవం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల ఆదరాభిమానాలతో పీవీపీ మాల్‌కు ఒక ప్రత్యేకత ఏర్పడిందని మాల్ అధినేత పొట్లూరి వరప్రసాద్ అన్నారు. ఎంజీరోడ్డులోని పీవీపీ మాల్ పదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్లూరి వరప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అన్ని వర్గాల వారు పీవీపీ మాల్‌పై ఆదరణ చూపుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. పుట్టిన ఊరిలో ఏర్పాటు చేసిన మాల్‌కు గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, రవి బోయపాటి, జాస్తి మూర్తి, మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ. శివరామకృష్ణ సూచించారు. స్థానిక ముత్యాంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం హార్ట్‌క్లినిక్ ఆధ్వర్యాన బాబా మందిర సహకారంతో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్య నియమాలు పాటించాలని పేర్కొన్నారు. మందిర అధ్యక్ష, కార్యదర్శులు పొన్నలూరి లక్ష్మణరావు, కుంచనపల్లి రవిశంకర్ మాట్లాడుతూ నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే సదుద్దేశ్యంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె. భారతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు


సమావేశానికి వర్చువల్‌గా హాజరైన కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 15వ తేదీన రాష్ట్రస్థాయిలో జరిగే 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, విజయవాడ మునిసిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీఓ బి.హెచ్.భవానీశంకర్ తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్గనిర్దేశం చేశారు. అదే విధంగా అదేరోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో జరగనున్న ఎట్ హోం కార్యక్రమానికి సంబంధించి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శన, ముఖ్యమైన భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరణ, వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలు, పోలీస్ బందోబస్తు తదితరాలపై సీఎస్ సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సృజన తెలిపారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

రహదారి భద్రత నియమాలు పాటించండి

ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి


మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి


అవగాహన సదస్సులో ఆటో డ్రైవర్లు

విజయవాడస్పోర్ట్స్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ డీసీపీ కె. చక్రవర్తి సూచించారు. విజయవాడలోని కమాండ్ కంట్రోల్ రూంలో నగరంలోని ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ చక్రవర్తి మాట్లాడుతూ నగరంలోని ట్రాఫిక్ రద్దీ, భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఆటోలు నడపాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాహన ఫిట్నెస్ చూసుకోవాలని, ఆటోలను నిర్దేశించిన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని పేర్కొన్నారు. ఫిట్నెస్ సరిగా లేకున్నా, ఎక్కడబడితే అక్కడ ఆటోలను పార్క్ చేసి ఇతర వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించకుండా వాహనాలు నడపాలని ఆదేశించారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి


అవగాహన ర్యాలీలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి శ్రీరామ శివ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి బారిన పడకుండా ఎలా ఉండాలో విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ గురించి తెలుసుకోవడంతో పాటు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వల్ల విలువైన జీవితం నాశనం అవుతుందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాలపైన అవగాహన కార్యక్రమాల్ని కొనసాగించడం అభినందించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్యూరో విజయవాడ వెస్ట్ సీఐ శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ అల్లూరయ్య, కళాశాల పీడీ డి. యుగంధర్, అధ్యాపకులు నవీన, రాధిక, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మెనెంట్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని నూతన ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మెనెంట్ చేసి పీఆర్సీ వర్తింపచేయాలని, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపేసి ఉద్యోగభద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ఐకేపీ యానిమేటర్లు, ఆర్పీలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం కార్మికులపై రాజకీయ వేధింపులు సాగిస్తుండడంతో కొంతమంది స్కీం వర్కర్లు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు నిలుపుదల చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సూకరాజు, ఉరుకూటి రాజు, బి.సోమయ్య, కె.పెంచల నరసయ్య, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

బాబా సేవలో 4వ అడిషనల్ కోర్టు సివిల్ జడ్జి రాజారామ్


నాలుగవ అడిషనల్ కోర్టు సివిల్ జడ్జి రాజారామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మదిరంలో గురువారం 4వ అడిషనల్ కోర్టు సివిల్ జడ్జి పి. రాజారామ్ బాబావారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వయంగా బాబావారి పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతోసత్కరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి మోహనరావు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వరశాస్త్రి, కోట ప్రసాద్‌లు నిర్వహించగా, ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన మైలవరం జమీందారు



మైలవరం: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని ఆయన కార్యాలయంలో ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు కుటుంబ సభ్యులు ఎస్వీఎన్ నివృతరావు, ఎస్. పృధ్వీ నరసింహారావు గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి, దేవాలయాల ఆస్తుల పరిరక్షణపై మంత్రితో చర్చించామని చైర్మన్ కార్యాలయం తెలిపింది.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల మూడో తేదీ సాయంత్రం నుంచి నాలుగో తేదీ ఉదయం వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైజర్‌పేట ఎర్రకట్ట రోడ్డులోని రిజర్వాయర్ వద్ద ఉన్న 8 ఎంజీడీ పంపింగ్ మెయిన్ లైన్‌పై 800 ఎంఎం డయాడి బట్టర్ వాల్స్ దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసే క్రమంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరిగే జీవీఆర్ నగర్, కండ్రిక విలేజ్, వాంబే కాలనీ-1, 2 బ్లాకులు, రాజీవ్‌నగర్ ఉడా కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ, రాజరాజేశ్వరిపేట 222, అజిత్‌సింగ్‌నగర్-1, 2, 3 బ్లాకులు, ప్రకాష్ నగర్, రాజీవ్‌నగర్, శాంతి నగర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ప్రైజర్‌పేట, టన్నెల్ బూస్టర్, కేఎల్‌రావు నగర్, చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్ట్ ఏరియా ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. ఆయా ప్రాంత వాసులు ముందుగానే నీటిని నిల్వచేసుకోవాలని, వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రామవరప్పాడు నుంచి రైల్వే స్టేషన్‌కు ఆర్టీసీ బస్సులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): నగరంలోని రామవరప్పాడు, రాయనపాడు రైల్వేస్టేషన్ నుంచి విజయవాడ రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.ఏ సుదానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఈ నెల రెండు నుంచి 11వ తేదీ వరకు విజయవాడ మీదుగా నడిచే పలు ప్రధాన రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రాయనపాడు, రామవరప్పాడు స్టేషన్ల మీదుగా దారి మళ్లించడంతో ఆయా రైల్వేస్టేషన్లలో దిగే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ బస్సులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

సత్తా చాటిన ఎస్టీవీఆర్ విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాల విద్యార్థులు బుధవారం జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ జట్టు ఎంపికల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం హెచ్ఎం సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు అభినందించారు. తమ పాఠశాలకు చెందిన నలుగురు బాలలు, ఏడుగురు బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం తమ పాఠశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 10, 11వ తేదీల్లో చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లుగా ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు తెలిపారు.